విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
99492 22450
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
2-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 212

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# కేరళలో రేవంత్ ఎన్నికల ప్రచారం

## త్రివేండ్రం కమ్యూనిస్టు, ఢిల్లీ కమ్యూనలిస్టు



**కేరళ సీఎం విజయన్, ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం**

**వారిద్దరినీ ఓడిస్తేనే కేరళకు మంచి రోజులు**

**లెఫ్ట్ ఫ్రంట్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టే..**

**సీఎంవ్యాఖ్యలను తప్పుబట్టిన కూనంనేని**

హైదరాబాద్: కేరళలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్)కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఢిల్లీ కమ్యూనలిస్టు ప్రధాని నరేంద్ర మోదీ, తివేంద్రం కమ్యూనిస్టు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఓడగొడితేనే కేరళకు మంచి రోజులు వస్తాయన్నారు. మోదీ--విజయన్‌లవి విభిన్న భావజాలాలైనా, భావాలొక్కటేనని, ఎల్డీఎఫ్--బీజేపీ మధ్య ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న రేవంత్ రెడ్డి కేరళలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్రివేంద్రం, నేమం, భరతన్నూర్, అలెప్పీ, కాయకుళం నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ కేరళ సీఎం పినరయి విజయన్‌ను ప్రధాని మోదీతో పోల్చారు. ప్రధాని మోదీకి, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని, విజయన్ ద్వారా కేరళ భవిష్యత్తును అపహరించాలని మోదీ చూస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను కేరళలోకి

2లో

## నేటి నుంచి భూభారతి అమలు

**ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం**

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

2లో



## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

**3వేల మందితో పోలీస్ బందోబస్తు**

**హైదరాబాద్ ప్రభాత సూర్య:** నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.



# అమరావతికి చట్టబద్ధత

## ఐదుకోట్ల ఆంధ్రుల విజయం



- విషం చిమ్ముతున్న వారికి ప్రజలే గుణపాఠం చెబుతారు
- అమరావతికి సహకరించిన మోడీ, అమిత్ షాలకు ధన్యవాదాలు
- అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక
- రాజధానిపై ఉన్న సందిగ్ధతకు ఇక తెరపడినట్లే
- గత వైకాపా అరచాకంతో రాజధాని లేకుండా పాలన
- ఆనాటి రైతులకు తీవ్ర వేధింపులు..మహిళలపై దాడులు
- లోక్‌సభ చర్చలో ఎంపి పురంధేశ్వరి
- ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు హర్షం

# జీవన్ రెడ్డికి బంపర్ ఆఫర్!

**బిఆర్ఎస్‌లో**

**సెక్రటరీ జనరల్ పదవి**

**అధికారంలోకి వస్తే రాజ్యసభ**

**కోడలికి జగిత్యాల అసెంబ్లీ టికెట్**

**ప్రభాత సూర్య తెలంగాణ బ్యూరో:** జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ లో ఒక పదవి ఖరారు చేశారా? ఆయన పార్టీలో చేరకముందే అది డిసైడ్ అయిందా? గులాబీ పార్టీలో భారీ ఆఫర్ తోనే ఆయన పార్టీలో చేరుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధాన్ని జీవన్ రెడ్డి తెంచుకున్న సంగతి తెలిసిందే.



## మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

**సిఐడి విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు**

- కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం
- ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

2లో

## దోచుకోవడానికే అమరావతి ప్లాన్

- అబద్దాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం
- రాష్టానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు
- కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం
- మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్

# తెలంగాణ సమాజానికి దగ్గరవుతున్న 'చంద్రబాబు'

ఏపీ సీఎం చంద్రబాబుపై తెలంగాణలో వ్యతిరేకత తగ్గుతోందా? అక్కడ ప్రజలు సానుకూలంగా చూస్తున్నారా? అందుకే అక్కడ నేతలు సైతం చంద్రబాబుతో స్నేహం చేసేందుకు ముందుకు వస్తున్నారా? చంద్రబాబు వ్యతిరేకులు ఇప్పుడు డిఫెన్స్ లో పడ్డారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.




- ఇన్ని రోజులు బాబును చూపి సెంటిమెంట్ రగిలించిన కేసీఆర్
- ఇప్పుడిప్పుడే వాస్తవాలు గ్రహిస్తున్న తెలంగాణ ప్రజలు
- టిడిపి అధినేత పై తగ్గిన ఆగ్రహం
- అందుకే దగ్గరయ్యేందుకు క్యూ కడుతున్న తెలంగాణ నేతలు

**ప్రభాత సూర్య: తెలంగాణ బ్యూరో:** ప్రస్తుతం తెలంగాణ రాజకీయ నేతల తో చంద్రబాబు సఖ్యత గానే గడుపుతున్నారు. వారి ఇళ్లల్లో శుభకార్యాలకు హాజరవుతున్నారు. చంద్రబాబుకు ప్రత్యేక ఆహ్వానాలు కూడా పంపుతున్నారు తెలంగాణ ప్రముఖులు. గతం కంటే పూర్తిగా సీన్ మారింది అనిపిస్తోంది తెలంగాణలో...



# కువైట్ విమానాశ్రయంపైకి ఇరాన్ డ్రోన్లు

- చమురు ట్యాంక్ పేలి భారీగా మంటలు
- ఖతర్‌లో చమురు నౌకపైనా దాడులు
- యూఏఈలో భారతీయునికి గాయాలు
- ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం
- టెహ్రాన్‌లో ఫెంటానిల్ ఫ్యాక్టరీపై దాడి

దుబాయ్/వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఇజ్రాయెల్--అమెరికా, ఇరాన్ నడుమ యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతూనే ఉంది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ బుధవారం దాడులకు దిగింది.

2లో



## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదపు

**30వేల మంది టెక్కీల తొలగింపు**

**అందులో 12వేమంది భారీతయులు**

# అమరావతికి చట్టబద్ధత

**అమరావతి, ప్రభాత సూర్య:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలపడంతో ఏపీ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రజలంతా గర్వించే క్షణాలివని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుందని.. లోక్ సభలో ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ ట్వీట్ చేశారు. అమరావతికి చట్టబద్ధత లభించడాన్ని జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలు బలమైన గుణపాఠం నేర్పిస్తారని మండిపడ్డారు. రాజధాని అమరావతికి తోడ్పాటును అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో.. అమరావతి ప్రజారాజధానిగా, భావితరాల అభివృద్ధికి కేంద్రంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'లోక్ సభలో అమరావతి బిల్లు ఆమోదం పొందిన ఈ చారిత్రక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది పౌరులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. ఈరోజు ఆంధప్రదేశ్ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలుస్తుంది. అమరావతిని ఏపీ ఏకైక, శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ అమరావతి బిల్లు ఆమోదం పొందడం ప్రజా సంకల్పం, స్థైర్యం, ఆశయాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. రాజధానికి 33,000 ఎకరాలకు పైగా భూమిని అప్పగించి సాటిలేని త్యాగం చేసిన అమరావతి ప్రాంత రైతాంగానికి నా ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వారి చేసిన త్యాగం తరతరాలపాటు గుర్తుండిపోతుందని అన్నారు. అమరావతి నిర్మాణానికి పునాది వేసి అచంచలమైన నిబద్ధత కలిగిన సీఎం చంద్రబాబు దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఈ కలను సాకారం చేయడంలో నిరంతర మద్దతు అందించిన ప్రధాని మోదీ, ఎన్డీయే ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. గత ప్రభుత్వపు తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల తలెత్తిన సవాళ్ల సమయంలో రాష్ట్ర ప్రజలు అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. తమ ఆశయాలకు అనుగుణంగా స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రగతి, స్థిరత్వానికి అనుగుణమైన భవిష్యత్తును ఎంచుకున్నారు. పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించడంతో ఆంధప్రదేశ్ ప్రజల్లోనే కాకుండా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లో బలమైన నూతన విశ్వాసం చిగురించింది. 'స్వర్ణ ఆంధ్ర-2047' కలను సాకారం చేయడంలో అమరావతి కీలకపాత్ర పోషిస్తుందని, అలాగే ప్రధాని మోదీ 'వికసిత్ భారత్-2047' లక్ష్యానికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందని దృఢంగా విశ్వసిస్తున్నా' అంటూ పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## దోచుకోవడానికే అమరావతి ప్లాన్

ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. అబద్ధాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన దృష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్థసారథి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ రాజధానులను తామే నిర్ణయించుకున్నాయని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ తీర్మానాల పేరుతో ఎందుకు డ్రామాలు ఆడుతోందని జగన్ ప్రశ్నించారు. అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. గతంలో 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదనంగా మరో 50 వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. చదరపు అడుగుకు రూ. 11 వేల నుండి రూ. 14 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఏ స్కాములు లేకపోతే అంత ఖర్చు ఎందుకు అవుతుంది? అభివృద్ధికి అవసరమైన రెండు లక్షల కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? ఈ ప్రాజెక్ట్ ఎన్నేళ్లకు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఐదున్నర గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేవలం తనను , వైసీపీని దూషించడానికే సభను వాడుకున్నారని జగన్ మండిపడ్డారు. ఒకవైపు అసెంబ్లీని పిలిచిన ప్రభుత్వం, అదే చట్టసభలో భాగమైన కౌన్సిల్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో చంద్రబాబు అవినీతిని సభ్యులు కడిగిపారేస్తారనే భయంతోనే బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిని మార్చకుండా చట్టం తెస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ.. అసెంబ్లీలో చట్టసవరణలు చేసే అధికారం సభకు ఉంటుందన్న విషయం బాబుకు తెలియదా అని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల్లో సానుభూతి పొందడానికే చంద్రబాబు ఇటువంటి విన్యాసాలు చేస్తున్నారని, ఆయన అసలు రంగు ప్రజలందరికీ తెలుసని జగన్ స్పష్టం చేశారు. అమరావతి విషయంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబడుతూ జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం రాజధాని అమరావతిపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతిపై కీలక చర్చ జరిగే సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మావిగన్ ప్లాన్-బి అంటూ ఏపీ రాజధానిపై మరోసారి జగన్ గందరగోళ ప్రకటన చేశారు. ఏపీ కోసం ప్రాక్టికల్‌గా ఆలోచించే వారికి మాత్రమే తాను చెప్పేది అర్థమవుతుందని అన్నారు.

## కువైట్ విమానాశ్రయంపైకి ఇరాన్ డ్రోన్లు

అక్కడి ఇంధన నిల్వ ట్యాంకులనే లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు ప్రయోగించింది. ఒక ట్యాంక్ పేలిపోయి విమానాశ్రయంలో భారీగా మంటలు చెలరేగినట్టు కువైట్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. ఖతర్ తీర సమీపంలో ఆ దేశానికి చెందిన ఓ చమురు నౌకపై కూడా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడి చేసింది. దాంతో అందులోని 21 మంది సిబ్బందిని హుటాహుటిన ఖాళీ చేయించారు. యూఏఈలోని ఫుజైరాలో డ్రోన్ శకలాలు తాకి ఒక వ్యక్తి మరణించాడు. బహ్రెయిన్‌పై కూడా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగింది. పలు క్షిపణులు, డ్రోన్లను నేలకూల్చినట్టు జోర్డాన్, సౌదీ అరేబియా ప్రకటించాయి. యూఏఈలోని ఉమ్ అల్ థౌబ్ పారిశ్రామిక ప్రాంతంపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఒక భారతీయుడు గాయపడ్డాడు. బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తి మరణించాడు. తన ప్రధాన శత్రువైన ఇజ్రాయెల్‌పై కూడా ఇరాన్ భారీ స్థాయిలో విరుచుకుపడింది. దేశవ్యాప్తంగా పలు నగరాలపై క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించింది. దాంతో ఎక్కడ చూసినా సైరన్ల మోత విని?పంచింది. ఐదుగురికి పైగా గాయపడ్డట్టు సమాచారం. హూతీ రెబెల్స్ కూడా ఇజ్రాయెల్‌పైకి క్షిపణులు ప్రయోగించారు! ఉత్తర ఇరాక్‌లోని ఇర్బిల్‌లో బ్రిటన్ ఇంధన సంస్థ బీపీకి చెందిన నిల్వ కేంద్రంపై డ్రోన్ దాడులు జరిగాయి.

## మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷-గ్గ÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మండిపడ్డారు.

## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు.

## జీవన్ రెడ్డికి బంపర్ ఆఫర్!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన సంగతి విధితమే. మొన్ననే జగిత్యాలలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీలో తనకు జరిగిన అవమానాలను అభిమానులకు వివరించే ప్రయత్నం చేశారు. గౌరవం లేని చోట ఉండలేనని తేల్చి చెప్పారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ నుంచి కొంతమంది పెద్దలు మంతనాలు చేశారు. కానీ జీవన్ రెడ్డి మాత్రం వెనక్కి తగ్గలేదు.కేశవరావు స్థానంలో..అయితే జీవన్ రెడ్డి భారీ ఆఫర్ తోనే గులాబీ పార్టీలో చేరినట్లు తెలుస్తోంది. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రాజ్యసభకు జీవన్ రెడ్డి.. ఆయన కోడలుకు జగిత్యాల అసెంబ్లీ సీటు ఇచ్చేందుకు కేసిఆర్ తో పాటు కేటీఆర్ అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే అంతకంటే ముందే బీఆర్ఎస్ లో జీవన్ రెడ్డి కి కీలక పదవి కట్టబెట్టనున్నారు. ఆ పార్టీలో అత్యున్నత పదవిగా సెక్రటరీ జనరల్ ట్రీట్ చేస్తారు. ఇతర పార్టీలో ఈ హోదా కనిపించదు. కానీ బీఆర్ఎస్ లో కనిపిస్తుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన సీనియర్ నేత కేశవరావుకు ఈ పదవి ఇచ్చారు. సుదీర్ఘకాలం పాటు ఇదే పదవిలో ఆయన కొనసాగారు. జాతీయ రాజకీయాల్లో పార్టీ తరఫున కీలక పాత్ర పోషించారు. అయితే కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పదవి ఖాళీ అయింది. ఇప్పుడు అదే పదవిని జీవన్ రెడ్డిని నియమించనున్నారు. తద్వారా పార్టీ తరఫున జాతీయస్థాయిలో గళం వినిపించే అవకాశం కల్పించారు. అంతటితో ఆగకుండా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రాజ్యసభ పదవి ఇవ్వనున్నారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో తన కోడలు చరిష్మారెడ్డిని వారసురాలిగా తేవాలని భావిస్తున్నారు జీవన్ రెడ్డి. కానీ ఇంతలోనే ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్లో చేరిపోయారు. జీవన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసిన కాంగ్రెస్ హై కమాండ్ వినలేదు. అందుకే ఆయన గులాబీ పార్టీలో చేరారు. అయితే వచ్చే ఎన్నికల్లో తన కోడలు చరిష్మారెడ్డిని గులాబీ పార్టీ తరఫున బరిలో దించనున్నారు. ఇప్పటికే ఆమె క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం అవుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో తనకు ఎదురైన అవమానాలను ప్రతీకరం తీర్చుకోవాలని జీవన్ రెడ్డి భావిస్తున్నారు. తాను రాజ్యసభకు ఎంపిక కావడం జాతీయ రాజకీయాల్లోకి.. తన వారసురాలిగా కోడలిని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు పక్కా వ్యూహంతో అడుగులు వేస్తున్నారు.

## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి భూభారతి అమలు

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

## కేరళలో రేవంత్ ఎన్నికల ప్రచారం

రానీయకుండా లక్ష్మణ రేఖ గీసింది యూడీఎఫ్ మాత్రమేనని అన్నా రు. కేరళ ప్రజలు బీజేపీ, ఎల్డీఎఫ్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎవరినైనా బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐతో వేధిస్తుందని, విజయన్‌సర్కారుపై ఈగ కూడా వాలనీయదని ఆరోపించారు. కేరళ సమగ్రాభివృద్ధి యూడీఎఫ్ లక్ష్యమన్నారు.

**మలయాళంలో పలకరింపు**

గత పన్నెండేళ్లుగా ఢిల్లీలో... పదేళ్లుగా కేరళలో పరిస్థితులు పూర్తిగా దిగజారాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో మోదీ, కేరళలో విజయన్ డబుల్ ఫెయిల్యూర్‌గా నిలిచారని ధ్వజమెత్తారు. ఇరువురి సిద్ధాంతాలు వేరైనా వైఫల్యాలు మాత్రం ఒకేలా ఉన్నాయని మండిపడ్డారు. నిరుద్యోగంతో ఇక్కడి యువత ఇబ్బంది పడుతోందని, అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. సోనియా గాంధీ దత్తత తీసుకున్న తెలంగాణ అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని.. కేరళ కూడా అలానే ముందుకు వెళ్లాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. కేరళ అభివృద్ధికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని, వారిద్దరూ కేరళ కుటుంబ సభ్యుల్లా మారారని తెలిపారు. ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్ ఓ సినిమాలో చెప్పిన 'నీ పో మోనే.. దినేశా..' తరహాలో 'నీ పో మోనే విజయన్, యువర్ టైమ్ ఈజ్ ఓవర్' (విజయన్ నీ సమయం అయిపోయింది.. వెళ్లిపో) అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. రేవంత్ మలయాళంలో పలకరించడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. రాత్రికి ఎర్నాకులంలో బస చేసిన రేవంత్ గురువారం కూడా కేరళ ప్రచారంలో పాల్గొననున్నారు.

## తెలంగాణ సమాజానికి దగ్గరవుతున్న 'చంద్రబాబు'

(మొదటి పేజీ తరువాయి)

**చంద్రబాబు అరెస్టు సమయంలో..:** ఏపీలో చంద్రబాబు అరెస్టు సమయంలో భిన్న పరిస్థితి ఉండేది తెలంగాణలో. అప్పట్లో కెసిఆర్ అధికారంలో ఉండేవారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఐటి ఉద్యోగుల ఆందోళనలకు కూడా అక్కడి ప్రభుత్వం అడ్డు తగిలిందంటే ఏ స్థాయిలో వ్యతిరేకించేదో అర్థమవుతుంది. వాస్తవానికి తెలంగాణ సమాజంలో చంద్రబాబు పై వ్యతిరేకత పెంచడంలో కెసిఆర్ ది కీలక పాత్ర. ఉద్యమం నాటి నుంచి నేటి వరకు కెసిఆర్ చంద్రబాబును ఆడి పోసుకునేవారు. చాలా చులకనగా మాట్లాడేవారు. తెలంగాణను అడ్డుకుంటుంది చంద్రబాబు అని ప్రజలకు వివరించే ప్రయత్నం చేసేవారు. అందుకే తెలంగాణలో టిడిపి తో పొత్తు పెట్టుకునేందుకు కూడా ఏ పార్టీ ముందుకు రాని విధంగా రాజకీయాలు చేశారు కేసీఆర్.

**వ్యతిరేకం తగ్గింది..:** ఇటీవల జరిగిన పరిణామాలు చూద్దాం. హరీష్ రావు లాంటి గులాబీ పార్టీ అగ్రనేత సైతం చంద్రబాబు గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. అదే పార్టీకి చెందిన మల్లారెడ్డి చంద్రబాబుపై తనకున్న అభిమానాన్ని దాచుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతల గురించి చెప్పనవసరం లేదు. కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు అయితే ఏకంగా చంద్రబాబుకు పాదాభివందనం చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అయితే అమరావతికి వెళ్లి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. తన ఇంటికి వచ్చిన చంద్రబాబును చూసి సంతోషం వ్యక్తం చేశారు. బాబు మోహన్ లాంటి నేతలు అయితే చంద్రబాబుతో సన్నిహితంగా మెలిగేందుకు ముందుకు వస్తున్నారు. కెసిఆర్ పార్టీలో పని చేసిన తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు.. ఇలా ఒక్కరేమిటి అంతా ఇప్పుడు చంద్రబాబుతో స్నేహం కోసం ముందుకొస్తున్నారు. అయితే పరిస్థితులకు తగ్గట్టు నడుచుకునే గుణం చంద్రబాబుది. ఖచ్చితంగా పూర్వపు టీం ఏర్పడితే తెలంగాణలో తెలుగుదేశం పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేస్తారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

**వ్యూహాత్మక మౌనం..:** అయితే చంద్రబాబు వ్యూహాత్మకంగా తెలంగాణ విషయంలో చాలా మౌనం పాటిస్తూ వచ్చారు. తెలంగాణ రాజకీయాల గురించి నోరు తెరిచిన దాఖలాలు కూడా లేవు. ప్రత్యర్థులు ఎంత రెచ్చగొట్టినా ఎప్పుడు రెచ్చిపోలేదు. సమయం వచ్చినప్పుడు చెబుదాం అన్నట్టు ఊరుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు తెలుగుదేశం పార్టీ. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం దూరంగా ఉండిపోయింది పోటీకి. తెలంగాణ సమాజంలో చంద్రబాబు అనే బూచి చూపించి కేసిఆర్ రాజకీయాలు చేశారు. కెసిఆర్ పార్టీలో ఉన్న నేతలు సైతం చంద్రబాబు సన్నిహితులే. కానీ ఏం చేయలేని నిస్సహాయత వారిది.

# మోడల్ స్కూల్ విద్యార్థులకు వేసవి ఇంటర్న్షిప్ శిక్షణ

### మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివ స్వరూప రాణి



**చౌటుప్పల్,ఏప్రిల్ 01, ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని ఆదర్శ పాఠశాల మోడల్ స్కూల్ విద్యార్థులకు వేసవి కాలంలో ఇంటర్న్షిప్ కోర్సు ప్రారంభించినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివ స్వరూప రాణి తెలిపారు. బుధవారం విద్యార్థులకు వ్యక్తిగత గ్రూమింగ్, స్వచ్ఛత, బ్యూటిషన్ రంగంలోని ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివ స్వరూప రాణి మాట్లాడుతూ... మార్చి 31 నుంచి వొకేషనల్ సబ్జెక్ట్ రిటైల్, బ్యూటిషన్ విద్యార్థులకు బ్యూటిషన్ శిక్షకురాలు, రిటైల్,వొకేషనల్ శిక్షకు రాలి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న తెలిపారు. విద్యార్థులు నైపుణ్య శిక్షణ ద్వారా విద్యార్థులు స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చని, ఆధునిక బ్యూటిషన్ రంగంలో స్కిల్ డెవలప్మెంట్ ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులను ప్రాక్టికల్ డెమోలు చూపించి ఉత్సాహపరిచారు. విద్యార్థుల కోసం 10 రోజుల వేసవి ఇంటర్న్షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఈ శిక్షణ కార్యక్రమాలను ఇంటర్న్షిప్పు , ట్రెండ్స్ సంస్థలలో మరియు నూఫా బ్యూటీపార్లర్ లలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందుతూ, రిటైల్ రంగంలో కస్టమర్ హ్యాండ్లింగ్, సెల్స్ టెక్నిక్స్, స్టోర్ మేనేజ్మెంట్ వంటి అంశాలతో అవగాహన పెంపొందించుకొంటారని అన్నారు. పనితీరు, కంటెంట్ క్రియేషన్, టెక్నికల్ స్కిల్స్ అంశాలను నేర్చుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపరచడమే కాకుండ భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు, వొకేషనల్ టీచర్స్ బాలరాజ్, బ్యూటిషన్ టీచర్స్ సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి...





**ఆలేరు ఏప్రిల్ 1 ప్రభాత సూర్య:** ఆలేరు మండలంలోని శారజీపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని వార్డును పరిసరాలను, క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని , ప్రతిరోజూ శానిటేషన్ పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి లో ఎంత మంది పనిచేస్తున్నారని,సిబ్బంది సంఖ్య, వారి హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి సిబ్బంది విధిగా విధులకు హాజరు నమోదు చేసుకుంటున్నారా లేదా అనే విషయాన్ని డైలీ అటెండెన్స్ లాగిన్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. ప్రతి రోజు ఓపి (ఔ)కి వచ్చే రోగుల సంఖ్య, వారి వివరాలను ఎలా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రోగుల రిజిస్టర్‌ను సరిగా నిర్వహించాలనీ, ప్రతి రోగి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రి లో అవసరమైన ఔషధాలు సరిపడా ఉన్నాయా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రోగులకు అందిస్తున్న మందుల వివరాలను సక్రమంగా రికార్డు చేస్తున్నారా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య అధికారి మనోహర్,వైద్యఅధికారులు, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కొడ్లను వెంటనే రద్దు చేయాలి

### కంభంపాటి పరుష రాములు (సీఐటీయూ) మండల కన్వీనర్

**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (ఏప్రిల్ 01)ప్రతినిధి :** మాడుగులపల్లి మండలంలోని కొత్తగూడెం గోదాం లోని హమాలీల ఆధ్వర్యంలో ఈ రోజు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని నిరసన తెలియజేస్తారు ఈ సంధర్భంగా (సీఐటీయూ) మండల కన్వీనర్ ఖమ్మంపాటి పరుష రాములు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చు కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నది 8 గంటల పని దినాన్ని మారుస్తూ 12 గంటల పని దినం పెంచుటకై ప్రయత్నం చేస్తున్నది కావున ఈ చట్టాలను రద్దు చేయాలని చెప్పి సిఐటి ఆధ్వర్యంలో ఈరోజు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాస్ హమాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు బాలయ్య నరేష్ జానయ్య చిరంజీవి సైదులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు




## ఐకెపి సెంటర్ ను సందర్శించిన కిసాన్ మోర్చ్ జాతీయ నాయకులు : గోలి మధుసూదన్ రెడ్డి

**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (ఏప్రిల్ 01) మాడుగుల పల్లి :** మాడుగులపల్లి మండల కేంద్రంలోని ఐకెపి సెంటర్ ను సందర్శించిన కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి ఐకెపి సెంటర్ ను పరిశీలించిన అనంతరం రైతుల కష్టాలను రైతుల వినతులను విన్నారు ధాన్యం కొనుగోలు విషయంలో లోటుపాట్లు ఉంటే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు సరదాగా రైతులతో ముచ్చటించారు ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి మండల అధ్యక్షుడు ఇటికాల జాన్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి కంచర్ల విద్యాసాగర్ రెడ్డి మండల వెంకన్న ఇందుగుల బూత్ అధ్యక్షులు బాల్నే కృష్ణారెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంకన్న విజయలక్ష్మి రమాదేవి సత్యం రెడ్డి రాజశేఖర్ తదితరులు ఉన్నారు



## ఖమ్మం మహిళా ప్రాంగణంలోని మామిడి తోటలోని మామిడి కాయలు వేలం



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** ఖమ్మం దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) టేకులపల్లి ఖమ్మం నందు గల మామిడి తోటలోని మామిడి కాయలు ఆక్షన్ వేయుటకు గాను నిర్ణయించినట్లుగా మహిళా ప్రాంగణం అధికారిణి వేల్పుల విజేత ఒక ప్రకటనలో తెలిపినారు. ఆక్షన్ నందు ఆసక్తి గల వారు ది. 04.04.2026 లోపు తమయొక్క వివరాలను మహిళా ప్రాంగణం కార్యాలయం నందు నమోదు చేపించుకోగలరు. వేలంపాట ది. 06.04.2026 మధ్యాన్నం 3.00 గంటలకు కలదు.పూర్తి వివరాల కొరకు కార్యాలయ పనిదినములో ఉ॥ 10.30 నుండి సా॥ 5.00 లోపు మహిళా ప్రాంగణం ఆఫీసు నందు సంప్రదించగలరు. లేదా ఫోన్ నెంబర్ 7660022512 నందు సంప్రదించగలరు.



## మృతుని కుటుంబానికి అండగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోలానువేణుగోపాల్ రెడ్డి 5000 రూపాయలు హార్దిక సహాయం...

**మర్రిగూడ ఏప్రిల్ 01 ప్రభాత సూర్య:** మర్రిగూడ మండలం కమ్మ గూడెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుడు దామెర శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోలాన్ వేణుగోపాల్ రెడ్డి పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సహాయం ఐదు వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, కుటుంబానికి పెద్ద దిక్కు అయినా శ్రీనివాసు మరణించడం అత్యంత దురదృష్టకరమని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ పరంగా కూడా కుటుంబానికి సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకటేష్ యాదవ్, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలే మల్లేష్, మర్రిగూడ మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, బీసీ సెల్ అధ్యక్షులు కాసర్ల అంజయ్య, ఇందుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు వీరమల్ల మల్లేష్, కమ్మ గూడెం మాజీ సర్పంచ్ మార్నేని లూర్దయా, బాల, దామెర మధు, దామెర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా సిఐటియు నిరసనలు



**మర్రిగూడ ఏప్రిల్ 01 ప్రభాత సూర్య :** మర్రిగూడ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా బుధవారం మండల కేంద్రంలో కార్మికులు బ్లాక్ డే గా నిర్వహించారు సిఐటియు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సి సిఐటియుసభ్యులు పాల్గొన్నారు

## శాసన మండలిలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు ప్రస్తావించిన విజయశాంతి కి కృతజ్ఞతలు

### తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం వెంటనే పెన్షన్ ఇంటి స్థలం మంజూరు చేయాలి

### తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బట్టు రాజేందర్



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** మండలిలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు ప్రస్తావించిన విజయశాంతి కి తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బట్టు రాజేందర్‌కృతజ్ఞతలు తెలిపారు.ఖమ్మం మయూరి సెంటర్ తెలంగాణ అమరవీరుల స్తూపం నందు బట్టు రాజేందర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం అభివృద్ధి కొరకు ఎమ్మెల్సీ విజయశాంతి మండల సమావేశంలో మాట్లాడటం అభినందనీయం అన్నారు. విజయశాంతి కి ధన్యవాదాలు తెలిపినారు.అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేలు అందరూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. నిజమైన ఉద్యమకారుల ఉద్యమకారుల జీవితాల్లో వెలుగులు నింపాలని పెన్షన్ 250 గజాల ఇంటి స్థలం ఇంటి నిర్మాణం కొరకు 30 లక్షలు ప్రతి అర్హులైన ఉద్యమకారులకు ఇవ్వాలని నామినేటెడ్ పదవులు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలంగాణ ఉద్యమకారులు ఇప్పటివరకు ఎటువంటి గుర్తింపు సంక్షేమం అభివృద్ధి ప్రయోజనాలు దక్కకపోవడం దురదృష్టకరం అన్నారు. ఈ కార్యక్రమం ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి కృష్ణ దాసరి శ్రీను పగడాల శ్రీనివాస్ ఎరుకపల్లి ఎల్లయ్య గోధుమల శ్రీను బానోతు వెంకటేష్ మోరు గోపి దొడ్డ శ్రీను పసుపులేటి విజయ్ కొండలరావు పట్టే నాగరాజు రోజా కాసాని నాగేశ్వరావు పాల్గొన్నారు.



## పగ్రతి ప్రణాళిక కార్యాచరణ భాగంగా గుండ్లగూడెం గ్రామంలో ఆరోగ్య శిబిరం..

**ఆలేరు ఏప్రిల్ 1 ప్రభాత సూర్య:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికల కార్యచరణ భాగంగా ఆలేరు మండలంలోని గుండ్లగూడెం గ్రామంలో ఎన్ సి డి(సంక్రమించని వ్యాధులు) ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేశారు. ఓపి, రక్త పోటు, షుగరు, వివిధ రకాల పరీక్షలు నిర్వహించి రోగుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరిశీలించారు. అవసరమైన వారికి తగిన మందులు అందజేసి ఆరోగ్య సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి తేజ, డాక్టర్ మానస, డాక్టర్ హైమావతి ప్రజలకు వైద్య సేవలు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి శిబిరాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏసి రెడ్డి మంజుల మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, ఏ ఎన్ ఎం లక్ష్మీ ,నిర్మల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల దొంగ అరెస్ట్.....



మాదాపూర్ ప్రభాత సూర్య : మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్థుడిని పోలీసులు అరెస్ట్ చేసి రూ.1.5 లక్షల విలువైన 31 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన సందీప్‌కుమార్ రెడ్డి (24), బాచుపల్లి సాయినగర్ నివాసి, ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి రాత్రి వేళల్లో హోటళ్లు, హాస్టళ్లను లక్ష్యంగా చేసుకొని గ్యాస్ సిలిండర్లు, ఇతర విలువైన వస్తువులను దొంగిలించి వాటిని విక్రయించి వచ్చిన డబ్బును బెట్టింగ్‌లో ఖర్చు చేస్తున్నాడు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజ్ సేకరించి ఎంఎస్‌సీడీ ఫేస్ రికగ్నిషన్ సాయంతో కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పాత కేసుతో పోల్చి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్, బాచుపల్లి, ఎస్.ఆర్.నగర్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన పలు కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలు తమ ఇళ్లను భద్రంగా తాళాలు వేసుకోవాలని, హోటల్, హాస్టల్ నిర్వాహకులు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారంలో కృషి చేసిన మాదాపూర్ క్రైమ్ టీంను ఉన్నతాధికారులు అభినందించారు.

## రాపిడో డ్రైవర్ నిజాయితీ....

### దొరికిన ఫోన్ పోలీసులకు అప్పగింత.....



**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రాపిడో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నారు. బుధవారం ఉదయం ఐకియా సమీపంలో రహదారిపై పడి ఉన్న ఒక మొబైల్ ఫోన్‌ను గుర్తించిన రాఘవేందర్ అనే రాపిడో డ్రైవర్, వెంటనే దానిని మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు అందజేశారు. అనంతరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ ఆ ఫోన్ యజమాని బాలమురళిని గుర్తించి, ఆయనను స్టేషన్‌కు పిలిపించి సురక్షితంగా ఫోన్‌ను అందజేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి ఫోన్‌ను అప్పగించిన రాఘవేందర్‌ను పోలీసులు ఈ సందర్భంగా అభినందించారు.

## యరగండ్లపల్లి గ్రామములో భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యము లో నూతన కమిటీ



**మర్రిగూడ ఏప్రిల్ 01 ప్రభాత సూర్య :** మర్రిగూడ మండలంలో ఎర్రగండ్లపల్లి గ్రామంలో బుధవారం రోజున నూతన భవన నిర్మాణ కమిటీ చేయడం జరిగింది కమిటీ అధ్యక్షుడు ఐతగిని రాములు గౌడ్. ఉపాధ్యక్షుడు ఉపనుతుల మల్లేష్ గౌరవ అధ్యక్షుడు వనపర్తి పెద్ద యదయ్య కార్యదర్శి పంగ చిన్న సత్తయ్య కోశాధికారి సిలివేరు యధయ్య సలహాదారులు..వనపర్తి యధయ్య పంకర్ల నర్సిమ్మ తోడేటి కొండయ్య ను సంఘం సభ్యులు ఎన్నుకోవడం జరిగింది

# పటాన్ చెరు నియోజకవర్గంలో రాజకీయ వాగ్వాదం తీవ్రం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పై కాట శ్రీనివాస్ గౌడ్ తీవ్ర విమర్శలు

### భూ వ్యవహారాలపై ఆరోపణలు, ప్రమాణానికి సవాల్

### సర్వే నంబర్లపై వివాదం, అవినీతి ఆరోపణల వెల్లడి



**అమీన్ పూర్, ఏప్రిల్ 1,(ప్రభాత సూర్య ):** నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. మీడియా సమావేశంలో కాట శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. స్థాయి గురించి మాట్లాడే హక్కు నీకు లేదని, ప్రజా ప్రతినిధిగా వ్యవహరించే తీరు సరైనది కాదని విమర్శించారు. దొంగల గురించి మాట్లాడటం సమంజసం కాదని తాను ముందుగానే హరీశ్ రావుకు తెలిపినట్లు పేర్కొన్నారు. తమ కుటుంబం ఆస్తులను అమ్ముకుని పేదలకు అండగా నిలిచిందని, చరిత్ర కలిగిన కుటుంబంపై అనవసర ఆరోపణలు చేయడం తగదని చెప్పారు. తమ కుటుంబం పేరుతో పలు కాలనీలు ఉన్నాయని గుర్తు చేశారు. మూడు సార్లు గెలిచినా రాజకీయ అవగాహన లేదని, ప్రజా సేవ కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. భూ వ్యవహారాలపై కూడా కాట శ్రీనివాస్ గౌడ్ పలు ఆరోపణలు చేశారు. కొన్ని సర్వే నంబర్లలో ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారని, అక్రమంగా భారీ మొత్తంలో సంపాదిస్తున్నారని అన్నారు. 62, 64, 65, 453, 178 సర్వే నంబర్లకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు. అక్రమంగా పొందిన ఆస్తులను ప్రజల ముందు బయటపెడతామని హెచ్చరించారు. ఇద్దరి ఆస్తులను బహిరంగం చేయాలని సవాల్ విసిరిన ఆయన, ఆరోపణలు నిజమని భావిస్తే ఆలయంలో ప్రమాణం చేయాలని ఆహ్వానించారు. బీరంగూడలో శివాలయంలో నిర్దిష్ట సమయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. తాను తీసుకున్న వైఖరిలో తప్పు లేదని, అవసరమైతే ఎంతదూరమైనా వెళ్లడానికి సిద్ధమని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం, ప్రజా స్థలాలపై దుర్వినియోగం చేయడం వంటి అంశాలను తీవ్రంగా ఖండించారు. వచ్చే రోజుల్లో అవినీతి విషయాలను మరింతగా బయటపెడతామని తెలిపారు.

# పట్టుతప్పుతున్న పట్టణ ప్రణాళిక విభాగం

### శ్రీ రామ్ నగర్ లో అక్రమ నిర్మాణాల జోరు.. రాఘవేంద్ర, రాజరాజేశ్వరీలో 6 నుండి 7 అంతస్తుల అక్రమ నిర్మాణాలు

**కొండాపూర్ ప్రభాత సూర్య:** శేరిలింగంపల్లి కొండాపూర్ డివిజన్ ప్రాంతంలో అద్దెలు అధికం కావడం వల్ల గృహ నిర్మాణదారులు రెండు నుంచి మూడు అంతస్తుల పర్మిషన్ ఉన్నప్పటికీ ఆశకు పోయి పరిమితికి మించి 6 నుండి ఏడు ఫ్లోర్లు అదనపు అంతస్తుల నిర్మాణాలు చేస్తున్నారు . రాఘవేంద్ర , రాజరాజేశ్వరి ఏ. బి. సి. కాలనీలు మరియు శ్రీరామ్ నగర్ కాలనీ ఏ .బి .సి లో జోరుగా అక్రమ నిర్మాణాలు ఉదయిస్తూనే ఉన్నాయి. శ్రీరామ్నగర్ బి, బ్లాక్ ప్లాట్ నెంబర్ 332,331 మరియు 1015 ఆర్ అంతస్తులు బిల్డింగ్ నిర్మించడం జరిగింది . స్థానిక ప్రజలు సీనియర్ సిటిజన్లు ఎన్నిసార్లు కంప్లైంట్ ఇచ్చిన పట్టించుకోని జిహెచ్ఎంసి అధికారులు పట్టణ ప్రణాళిక విభాగం చర్యలు తీసుకోవడం తో విచ్చలవిడిగా నిర్మిస్తున్న భవనాల వల్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పొంగి పొర్లుతూ దుర్గంధం వెదజలుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు, ప్రధానంగా ప్రజలు నీటి వినియోగం ఎక్కువ గా అవడం తో బోర్లు ఎండిపోయి ట్యాంకర్ ల పై ఆధారపడాల్సిన పరిస్థితిఉత్పన్నమయ్యింది .పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మిస్తున్న పట్టించుకొని జి హెచ్ ఎం సి అధికారులు, ప్రజా పాలనలో ప్రజలకు న్యాయం చేయవలసిన డిప్యూటీ కమిషనర్ . అసిస్టెంట్ సిటీ ప్లానర్. టౌన్ ప్లానింగ్ విభాగం విధులలో భాగంగా పర్యవేక్షించకపోవడం వల్ల జిహెచ్ఎంసి ఆదాయానికి గండి పడుతుంది.

**డ్రైనేజ్ సమస్యలు ట్రాఫిక్ జామ్ ఉత్పన్నం కావడంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో లోపమా.......**

100 నుండి 200 మరియు 300 గజాలలో పరిమితికి మించి అంతస్తుల మీద అంతస్తులు వేయడం వల రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాల వల్ల ఎమర్జెన్సీ సేవలను సకాలంలో అందుకోలేక పోతున్నామని స్థానిక వాసులు, ప్రజలు ఆందోళన ను వ్యక్తం చేశారు. మరో వైపు హాస్టల్ నిర్వాహకుల వల్ల నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం నివాసితులు వినతి పత్రం లు సమర్పించారు. పరిమితికి మించిన అదనపు అంతస్తుల నిర్మాణాలు బిల్డర్ లకి లాభాలు కలిగిస్తాయి కాలనీ నివాసులు నీటికి మరియు డ్రైనేజీ సమస్యలు, ట్రాఫిక్ జామ్ సమస్యలకి గురవుతున్న విషయం గుర్తించి జి హెచ్ ఎం సి అధికారులు సిబ్బంది కదలి వాటిని కట్టడి చేయాలని స్థానిక నివాసులు సీనియర్ సిటిజన్స్ రిటైర్డ్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.



## కార్మిక హక్కులను కాల రాస్తే ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడుతాం....

### బ్లాక్ డేలో కార్మిక నేతలు

**మిర్యాలగూడ, ఏప్రిల్ 1:- (ప్రభాత సూర్య) :** బిజెపి మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించే పేరుతో కార్మిక వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి ఏప్రిల్ 1 నుండి అమలు చేస్తామని ప్రకటించిన నిర్ణయాన్ని తీవ్రంగా నిరసిస్తూ భారత జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం బ్లాక్ డే పాటించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కొత్త లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమ హక్కులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.కార్మిక సంఘాల పిలుపు మేరకు వివిధ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ వ్యతిరేకత తెలిపారు.కార్మికుల హక్కులను పరిరక్షించే వరకు, కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కంచి కేశవులు, మిర్యాలగూడ అధ్యక్షులు వల్లాల రవి, కోడిరెక్క మల్లయ్య, ఉంగరాల వెంకటి, వెంకటయ్య, పసల ఇన్నయ్య, కుమేర జానీ, ఉపేందర్, జల్లా రాంబాబు, ఉపేందర్ పాల్గొన్నారు



## రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర, రైతు భరోసా చెల్లించడంలో ప్రభుత్వం విఫలం

### మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



**మిర్యాలగూడ ఏప్రిల్ 1:- (ప్రభాత సూర్య):** యాసంగి సీజన్లో రైతులు ఆరుగాలం కష్టించి నష్టంతో పండించిన దాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేలా, కనీసం రైతు భరోసా అయిన సకాలంలో వచ్చేలా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో పెట్టుబడులు పెరిగాయని, యూరియా సకాలంలో లభించలేదని దీంతో ఉత్పత్తి తగ్గిందన్నారు. రైస్ మిల్లర్లు రైతుల కష్టానష్టాలు, ఇబ్బందులు రైస్ మిల్లర్లు అర్ధం చేసుకుని క్వింటాలు దాన్యానికి న్యాయంగా క్వింటాలుకి రూ.3000లు ధర ఇవ్వాలని ఆయన కోరారు. రైస్ మిల్లర్లు ధ్యాన్యం రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు సీజన్లలో రైతుభరోసా డబ్బులు రైతులకు చెల్లించలేదని ఇప్పటికైనా ఇబ్బంది పడ్తున్నసన్నకారు, పేద, మధ్యతరగతి రైతులకు రైతుభరోసా వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పిల్లుట్ల సైదులు, సీఐటీయు నాయకులు ఎం. లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, జి. రాంచంద్రు పాల్గొన్నారు.





## కార్మిక చట్టాలను, హక్కులను భూస్థాపితం చేయడమే 4 కోడ్ ల లక్ష్యం..పద్మ సుదర్శన్,గడ్డం నాగరాజు..

**ఆలేరు ఏప్రిల్ 1 ప్రభాత సూర్య:** కార్మిక చట్టాలను, హక్కులను భూస్థాపితం చేసి కార్మికుల శ్రమను యదేచ్ఛగా దోచుకునే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మికులు కోరినప్పటికీ వినకుండా బీ జే పీ మోడీ అమలు చేయడం అత్యంత దుర్మార్గమని ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్,ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు అన్నారు. ఏప్రిల్ ఒకటి నుండి 4 లేబర్ కోడ్ ల అమలును వ్యతిరేకిస్తూ ఐ ఎఫ్ టి యు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు లో భాగంగా ఆలేరు మండలంలోని కొలనుపాక, మందనపల్లి, టంగుటూరు లో బ్లాక్ డే గా పాటించి నల్ల జెండాలతో ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్,నాగరాజు మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మికులు పెద్ద ఎత్తున పోరాడినప్పటికి ఏమాత్రం కూడా పట్టించుకోని బీ జే పీ మోడీ బడా కార్పోరేట్ సంస్థలకు కార్మికుల భవిష్యత్ ను చీకటి మయం చేయడానికి పూనుకోవడం కార్మికులు బీ జే పీ ని ఎన్నడూ క్షమించరాని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి,కార్మిక సంఘ నాయకులు ఇక్కిరి సహదేవ్,మామిడాల బాల మల్లేష్,నోముల వెంకటేష్, కళ్లెపు చంద్రయ్య, కొత్తపేట వీరమల్లు,మారుజోడు కుమార్ ఎక్కిడి సంపత్ బొజ్జ పరుశురాములు, తమ్మడి అంజయ్య,యెలగందుల సిద్దులు,మారేబోయిన పరుశురాములు,నల్ల నర్సింగరావు, గందమల్ల బాలరాజు,గుండె బాల్ నర్సయ్య,నమిలే ఐలయ్య, కడకంచి సోములు నోముల రవి కడ కంచి కృష్ణ ఎర్రంబెల్లి ఐలయ్య బుచ్చ గారి ఎల్లేష్ కొంగరి సత్తయ్య మామిడాల భానుచందర్ మామిడాల మధు, దార యాదగిరి, డ్యాగల శ్రీరాములు,నిమిషకవి ముత్యాలు, మారేబోయిన ఎల్లెష్, కుర్రి మార్కండేయ, సుంచు రాములు,కడకంచి సత్తయ్య,కడకంచి సిద్దులు, దైతల నర్సయ్య, కూకట్ల మల్లేష్,కండికొండ శ్రీను,పంగ పరుశురాములు, ఇక్కిరి మధు, బట్టికాడి మల్లేష్,కుర్రి సాయి, కోటగిరి శ్రీధర్,గుండు నరేందర్ బాబు, కర్రె స్వామి, కుర్రి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.




## పౌల్ట్రీ పరిశ్రమలో కార్పొరేట్ కంపెనీల విధానాలకు నిరసనగా బందు పాటిస్తూ బైక్ ర్యాలీ

**మిర్యాలగూడ, ఏప్రిల్ 1:- (ప్రభాత సూర్య) :** పౌల్ట్రీ పరిశ్రమలో కార్పొరేట్ కంపెనీల విధానాలకు నిరసనగా మిర్యాలగూడలో చికెన్ షాప్స్ ఓనర్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం చికెన్ షాపుల బందు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ పౌల్ట్రీకార్పొరేట్ కంపెనీల విధానాల వల్ల, అనుసరించే పద్ధతుల వల్ల పౌల్ట్రీ ట్రేడర్స్, చికెన్ షాపుల ఓనర్స్ చాలా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఈ కార్పొరేషన్ వల్ల ఎదుర్కోవటం జరుగుతుంది దీనికి నిరసనగా దీనికి నిరసనగా ఈరోజు చికెన్ షాప్ ఓనర్స్ అండ్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ కంపెనీల వల్ల వారికి జరుగుతున్న నష్టం, బాధను వ్యక్తపరచారు. తమ ఆందోళనను ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. కార్యక్రమంలో చికెన్ షాపుల సంఘం అధ్యక్షుడు నరేందర్రెడ్డి, కార్యదర్శి రాంబాబు, శ్రీనివాస్ రియాజ్ భాయ్, తిరుమల్ రావు, షఫీ, కార్యవర్గ సభ్యులు, ఓనర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా బి.వి.రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 29వ వార్షికోత్సవ వేడుకలు






**ప్రభాత సూర్య నర్సాపూర్ ఏప్రిల్ 01:** నర్సాపూర్‌లోని బి.వి.రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 29వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం, 01 ఏప్రిల్ 2026 సాయంత్రం గ్రీన్ క్యాంపస్ వాతావరణంలో లో ఎంతో వైభవంగా, ఉత్సాహభరితంగానిర్వహించబడ్డాయి

కళాశాల ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే సభకు స్వాగతం పలికి వార్షిక నివేదికను సమర్పించడంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంస్థ సాధించిన ప్రగతి, విద్యార్థుల ప్రతిభా విజయాలు, 100 శాతం ప్లేస్మెంట్ సాధన వంటి ముఖ్యాంశాలను ఆయన వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సురేష్ నర్రా, సెంటర్ హెడ్, ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ పాల్గొని వేడుకలకు మరింత శోభను చేకూర్చారు. ఆయన తృష్ణ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను, లేఖిని కార్యక్రమాన్ని సందర్శించి, విద్యార్థుల సృజనాత్మకతను, వినూత్న ప్రాజెక్టులను అభినందించారు. ముఖ్య అతిథి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యతో పాటు నైపుణ్యాలు, క్రమశిక్షణ జీవితంలోఎంతో ముఖ్యమని తెలిపారు.ఈ వేడుకలకు విశిష్ట అతిథిగా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవి చంద్రన్ రాజగోపాల్ హాజరై, విద్యార్థులను ఉత్తమమైన నాయకత్వ లక్ష్యాల వైపు ప్రోత్సహించేలా ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు.ఈ సందర్భంగా ఇటీవల డాక్టరేట్ పట్టాలు పొందిన అధ్యాపకులను ముఖ్య అతిథి సురేష్ నర్రా మరియు రవి చంద్రన్ రాజగోపాల్ సన్మానించారు. ఈ వేడుకలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, సంగీత ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే క్రీడలు, విద్యా రంగాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

కళాశాల డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, కళాశాల విజన్‌ను వివరించడమే కాకుండా, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి. విష్ణు రాజు ఆశయాలకు అనుగుణంగా విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేసే విధంగా కళాశాల పనిచేస్తుందని చెప్పారు.కె వి విష్ణు రాజు నిరంతరం విద్యార్థుల గురుంచి ఆలోసిస్తారని నేడు జాబ్ మార్కెట్లో కష్టతరమైన 100% విద్యార్థులు ప్లేసెమెంట్ పొందటానికి వారి యొక్క కృషి ఫలితమే నేడు విద్యార్థులు ఉన్నతమైన స్థానంలో ఉండేందుకు దోహదమైనదని విద్యార్థుల ఆనందమే తనదిగా భావించే మంచి మనిషి కె వి విష్ణు రాజు వలన ఈ సంస్థ ఉన్నత స్థాయికి చేరిందని తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కళాశాల యాజమాన్యం అందరికీ భోజన ఏర్పాట్లు చేసింది.కార్యక్రమాన్ని కళాశాల మేనేజర్ బి. బాపి రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.ఎల్.ఎన్. సురేష్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు.



## ఇందుగుల ప్రాథమిక పాఠశాలలో రెండు నూతన గదులను నిర్మించిన

### ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు

### కీ :శే ముదిరెడ్డి లింగారెడ్డి జ్ఞాపకం



**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (ఏప్రిల్ 01)ప్రతినిధి :** మాడుగుల పల్లి మండలం ఇందుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల యందు తరగతి గదులు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థుల, సమస్యలను గమనించిన ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి వెంటనే స్పందించి విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి వారి తండ్రి గారైన కీ :శే :ముదిరెడ్డి లింగారెడ్డి జ్ఞాపకార్థం వారి మనుమరాండ్రు సహకారంతో అతి తక్కువ వ్యవధిలో అదునాతణమైన రెండు తరగతి గదులను నిర్మించిన ఘనత వారికే దక్కింది,వారితో పాటు ఎంఈఓ శంకరమ్మ ఊరు పెద్దలు కృష్ణయ్య కన్నయ్య నాగరాజు దామోదర్ రెడ్డి శోభన్ రెడ్డి పరశురాములు నరసింహ తదితరులు వారితోపాటు మహిళలు ఉపాధ్యాయురాలు పాఠశాలకు పూర్తి సహాయ సహకారాలు అందించిన వారి కుటుంబ సభ్యులందరికి పేరు పేరునా మా పాఠశాల ఉపాధ్యాయుల తరపున హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు

## యువత గంజాయి కి దూరంగా ఉండాలి: తుర్కపల్లి ఎస్సై



**తుర్కపల్లి, ఏప్రిల్ 01 ప్రభాతసూర్య:** యువత గంజాయి కి దూరంగా ఉండాలని, గంజాయి తాగే వారిపట్ల అమ్మే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తక్యుద్దీన్ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామ శివారులో అక్రమంగా గంజాయిని కలిగి కలిగి ఉన్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి మాదాపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి దగ్గర ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద సుమారు 200 గ్రాముల గంజాయి దొరికిందని, సదర్ నిందితులు అట్టి గంజాయిని కలకత్తా నుండి కొనుగోలు చేసి మాదాపురం కు తరలించి అమ్ముతున్నారని అన్నారు. నిందితులు ఒగ్గు బాబు జూకంటి సత్యం, ఒగ్గు నవీన్ కుమార్ జూకంటి శివకుమార్ దిరావత్ దేవేందర్ లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి 200 గ్రాముల గంజాయి, ఫ్యాషన్ మోటార్ సైకిల్, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు



## ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే రేషన్ కార్డు రద్దు అవుతాయనే ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి.

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**ప్రభాత సూర్య //మాడుగుల పల్లి (ఏప్రిల్ 01)ప్రతినిధి :** ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ధనిక,పేద,మధ్య తరగతి అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తున్నారని కానీ ప్రస్తుతం ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారి రేషన్ కార్డులు రద్దవుతాయని ప్రచారం జోరుగా సాగుతుందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని బీసీ జేఏసీ రాష్ట్ర జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఆదాయం ఎక్కువ లేకున్న మధ్య తరగతి ప్రజలు వ్యక్తి గత రుణాల కోసం,ఇంటి రుణాల కోసం ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తున్నారని ఇలా మూడు సంవత్సరాల ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత రుణాలు గాని ఇంటి లోన్లు గాని ఇస్తున్నారని అన్నారు. ఏదైనా పరిహారం పొందాలన్నా ఏదైనా వ్యక్తిగత ఆస్తులు అమ్మాలన్న ఐటి రిటర్న్స్ అనేవి తప్పనిసరి అయ్యాయని పేర్కొన్నారు.ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ ఆలోచన ఉంటే వెంటనే విరమించుకోవాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు

## ఇంటర్మీడియట్ బోర్డు నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్న భాషిత కాలేజీ

### తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎన్ ఎస్ యు ఐ నాయకుల డిమాండ్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 01 (ప్రభాత సూర్య) :** తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ తరఫున గొల్ల జాన్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కుందన్ యాదవ్‌తో కలిసి అకాడమిక్ జాయింట్ సెక్రటరీ కె. వసుంధరా దేవి కి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఇంటర్మీడియట్ బోర్డు నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్న భాషిత కాలేజీపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐడీపీఎల్, కుత్బుల్లాపూర్‌లో ఉన్న భాషిత కాలేజీలో జరుగుతున్న అక్రమ, అసురక్షిత కార్యకలాపాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంస్థ 5వ అంతస్తులో ఫైర్ ఎన్ ఓ సి లేకుండా, అగ్నిమాపక భద్రతా నిబంధనలు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు విరుద్ధంగా హాస్టల్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ నిర్లక్ష్య చర్యలు విద్యార్థుల ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి. పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, కాలేజీ యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. అదేవిధంగా, అవసరమైన భద్రతా ప్రమాణాలు పరిశీలించకుండా అదే సంస్థకు పరీక్షా కేంద్రం కేటాయించడం ఆందోళనకర విషయం. ఇది సంబంధిత అధికారుల పర్యవేక్షణపై తీవ్రమైన సందేహాలను లేవనెత్తుతోంది. ఎన్ ఎస్ యు ఐ తరఫున మా డిమాండ్లు సంస్థపై తక్షణ సమగ్ర తనిఖీ నిర్వహించాలి. కాలేజీకి కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని వెంటనే రద్దు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యం చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి.తక్షణ చర్యలు తీసుకోకపోతే, ఈ విషయాన్ని హైకోర్టు, విజిలెన్స్ సంస్థల దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలి.



## హనుమాన్ ధీక్ష స్వాముల సందడి ప్రారంభం

**కూకట్ పల్లి, ఏప్రిల్ 01 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ పాపిరెడ్డి నగర్ లో గల శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ శివాలయంలో హనుమాన్ దీక్ష స్వాముల సందడి మొదలైంది. పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు మండల దీక్షలు చేపట్టారు.

**శంకర్ గురు స్వామి ఆధ్వర్యంలో అన్న వితరణ**

శంకర్ గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ మాల దీక్ష స్వాముల కోసం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వాములు పెద్ద ఎత్తున హాజరై శ్రీరామ హనుమాన్ భక్తి పాటలతో భజన చేసిన అనంతరం అన్న ప్రసాదాలు స్వీకరించారు.

## గాంధీజీ ఫౌండేషన్ సేవలు అభినందనీయం ఆర్డీవో శ్రీదేవి.....



**ప్రభాత సూర్య చండూర్ ప్రతినిధి:** 28 నెలలుగా పేదవారికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నిత్యవసర సరుకులు అందజేస్తూ ప్రతినెల 30 మంది నిరుపేదలకు గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ తస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోటి శ్రీనివాసులు 2024 జనవరి ఒకటో తేదీన ప్రారంభించిన గాంధీజీ ఫౌండేషన్ నిరుపేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే కార్యక్రమం మొదలుపెట్టారు ఈరోజు కూడా వారందరికీ నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్డీవో శ్రీదేవి హాజరయ్యారు వారు మాట్లాడుతూ సమాజంలో పేదలకు సహాయం చేయాలని ఆలోచన రావడం డాక్టర్ కోడి శ్రీనివాసులకి ధన్యవాదాలు తెలుపడం జరిగింది . దానం చేసే గుణం ఉంటే వారు ప్రజల మనసులో ఉంటారని వారి పేరు కోవడం జరిగింది 30 నెలలుగా వారు పేదవారందరికీ నిత్యంగా సరుకులు ఇవ్వడం వారి వారి దాన గుణానికి ధన్యవాదాలు అని తెలిపారు అదేవిధంగా వృద్ధ తల్లిదండ్రుల ఆలనా పాలన చూడడం బిడ్డల ధర్మం అని వారి పేర్కొన్నారు అని విడిచి పెట్టొద్దని మనని చిన్నతనంలో ఎలా చూశారో అదే విధంగా తల్లిదండ్రులను చూడాలని వారి పేర్కొన్నారు గాంధీజీ ఫౌండేషన్ పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ మరియు చనిపోయిన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని చేస్తూ వస్తుందని వారు తెలిపారుశీ త్వరలో వాటర్ ట్యాంక్ సెంటర్లో వేసవికాలంలో వచ్చి పోయే బాటసారులకు చలివేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ కోడి శ్రీనివాసలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ భార్గవ్, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్, కందుల కృష్ణయ్య, బోడ విజయ్, బుషిపాక యాదగిరి, బోడ సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు

## అక్షయ ఎన్‌క్లేవ్ పార్కు స్థలంపై కబ్జాదారుల కన్ను.. హైడ్రా ప్రజావాణి తో చెక్!

### తప్పుడు పత్రాలతో 968 గజాల భూమి కొట్టేసే ప్లాన్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 01 (ప్రభాత సూర్య):** అక్రమ కట్టడాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పరిధిలోని బాలానగర్ మండలంలో కోట్ల విలువైన పార్కు స్థలాన్ని కబ్జాదారుల కోరల నుంచి విడిపించి, స్థానికులకు ఊరటనిచ్చింది. బాలానగర్ మండలం పరిధిలోని అక్షయ ఎన్‌క్లేవ్‌లో 1983వ సంవత్సరంలో సుమారు 7.12 ఎకరాల్లో హుడా అనుమతితో లేఅవుట్ వెలిసింది. ఈ లేఅవుట్‌లో నిబంధనల ప్రకారం 968 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, ఈ ఖరీదైన స్థలంపై కన్నేసిన అబ్దుల్ రెహ్మాన్ (అలియాస్ గోపాల్) అనే వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి ఆ భూమిని కాజేయాలని చూశాడు. కబ్జాదారుడి ప్రయత్నాలను గమనించిన స్థానికులు, కాలనీ వాసులు హైడ్రా నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సదరు స్థలం రికార్డుల ప్రకారం పార్కుకు చెందినదని తేల్చారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ (GHMC) అక్కడ ప్రహరీ గోడ నిర్మించి, గేటు కూడా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తించారు. సదరు వ్యక్తి 2019లో అధికార యంత్రాంగం కళ్ళుగప్పి తప్పుడు పత్రాలతో నిర్మాణ అనుమతులు కూడా పొందినట్లు విచారణలో తేలింది. దీనిపై గతంలోనే జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు సొసైటీ ప్రతినిధులు కూడా కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ కబ్జాదారుడు వెనక్కి తగ్గకుండా పార్కు స్థలంలో నిర్మాణ సామగ్రిని వేసి ఆక్రమణకు సిద్ధమయ్యాడు. ఫిర్యాదులో వాస్తవం ఉందని నిర్ధారించుకున్న హైడ్రా అధికారులు, తక్షణమే చర్యలు చేపట్టారు. పార్కు స్థలంలో వేసిన నిర్మాణ సామగ్రిని తొలగించి, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఇది "పార్కు స్థలం - ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరిస్తూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు. కోట్ల విలువైన బహిరంగ స్థలాన్ని కాపాడటంతో అక్షయ ఎన్‌క్లేవ్ నివాసితులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు నిర్మాణ పనులు

## నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు





**ప్రభాత సూర్య నర్సాపూర్ ఏప్రిల్01:** గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలను పాటించకుండా ఇష్టానుసారంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. "నాణ్యతతో తమకు పనిలేదు.. రోడ్డు వేశామా.. కమిషన్ ఇచ్చామా.. బిల్లు పొందామా.. " అన్నట్టు కొందరు గుత్తేదారుల వ్యవహార శైలి వుంది. హత్నూర మండలానికి ఎన్,ఆర్,ఈజి,ఎస్ పథకం కింద సిసి రోడ్ల నిర్మాణం కోసం ఒక కోటి 25 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. సిసి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందించడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని అని ఆశయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్, ఆర్ ,ఈజీ,ఎస్ పథకం కింద ఇటీవల మంజూరైన అంతర్గత రహదాల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిస్తూ చేపడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు సాధారణంగా అంతర్గత రహదారుల నిర్మాణం ప్రాధాన్యత అనుసారం నిర్మించాలని చేపడుతున్నారు కానీ నిర్మాణంలో నాసిరకమైన ఇసుక వాడటంతో పాటు.. ఇసుక శాతం కంటే కంకర పొడి (డస్ట్) ఎక్కువగా వాడటం, తక్కువ గ్రేడ్ సిమెంట్ వినియోగిస్తూ ఒక్క లోడ్ కి సుమారు 10 కట్టల సిమెంట్ ఉపయోగానికి 5 లేదా 6 బస్తాలను వినియోగిస్తూ నాణ్యత విస్మరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా కొందరు గుత్తేదారులు నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. పది రోజుల పాటు వాటర్ క్యూరింగ్ చేయాల్సి వుండగా ఎక్కడా ఇటువంటి జరగడం లేదు. నాసిరకం పనులు చేయడం వల్ల మూన్నాళ్లకే పగుళ్లు ఏర్పడటం, డస్ట్ వినియోగం మూలంగా రోడ్డు నాణ్యత దెబ్బతిని కొంతకాలానికే కంకర తేలిపోవడం జరుగుతాయని ప్రజలు ఆరోపిస్తున్నారు,

**పర్సంటేజ్ లెక్కల్లో అధికారులు..!?**

రోడ్డు నిర్మాణం చేపట్టాలి అంటే ముందుగా సంబంధించిన గ్రామ పంచాయతీ తీర్మానం, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ఆ ప్రదేశాన్ని పరిశీలించి జియో కాప్చర్ చేయడం, పనులకు సంబంధించి ఎస్టిమేట్ వేయడం, ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి కూలీలు ముగ్గురితో వర్క్ చేయించి మాస్టర్ వేయడం ఇవన్నీ చేసిన అనంతరం ఏఈ అనుమతితో పనులు ప్రారంభమవుతాయి. పనులు జరిగే ప్రదేశంలో ఏఈ స్థాయి అధికారి లేదా వర్క్ ఇన్ స్పెక్టర్ తప్పకుండా వుండాలి. ప్రస్తుతం ఇటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. కేవలం పర్సంటెజీలపైన దృష్టి సారించి నాణ్యతను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



## గాంధీజీ ఫౌండేషన్ సేవలు అభినందనీయం ఆర్డీవో శ్రీదేవి.....

ప్రభాత సూర్య చండూర్ ప్రతినిధి.. 28 నెలలుగా పేదవారికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నిత్యవసర సరుకులు అందజేస్తూ ప్రతినెల 30 మంది నిరుపేదలకు గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు శ్రీనివాసులు 2024 జనవరి ఒకటో తేదీన ప్రారంభించిన గాంధీజీ ఫౌండేషన్ నిరుపేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే కార్యక్రమం మొదలుపెట్టారు ఈరోజు కూడా వారందరికీ నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్డీవో శ్రీదేవి హాజరయ్యారు వారు మాట్లాడుతూ సమాజంలో పేదలకు సహాయం చేయాలని ఆలోచన రావడం డాక్టర్ కోడి శ్రీనివాసులకి ధన్యవాదాలు తెలుపడం జరిగింది . దానం చేసే గుణం ఉంటే వారు ప్రజల మనసులో ఉంటారని వారి పేరు కోవడం జరిగింది 30 నెలలుగా వారు పేదవారందరికీ నిత్యంగా సరుకులు ఇవ్వడం వారి వారి దాన గుణానికి ధన్యవాదాలు అని తెలిపారు అదేవిధంగా వృద్ధ తల్లిదండ్రుల ఆలనా పాలన చూడడం బిడ్డల ధర్మం అని వారి పేర్కొన్నారు అని విడిచి పెట్టొద్దని మనని చిన్నతనంలో ఎలా చూశారో అదే విధంగా తల్లిదండ్రులను చూడాలని వారి పేర్కొన్నారు గాంధీజీ ఫౌండేషన్ పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ మరియు చనిపోయిన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని చేస్తూ వస్తుందని వారు తెలిపారుశీ త్వరలో వాటర్ ట్యాంక్ సెంటర్లో వేసవికాలంలో వచ్చి పోయే బాటసారులకు చలివేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ కోడి శ్రీనివాసలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ భార్గవ్, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్, కందుల కృష్ణయ్య, బోడ విజయ్, బుషిపాక యాదగిరి, బోడ సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు



## రోజు రోజు దాన్యం ధర తగ్గిస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

### సబ్ కలెక్టర్ అమిత్ ను కోరిన రైతు సంఘం

**మిర్యాలగూడ , ఏప్రిల్ 1:-( ప్రభాత సూర్య) :** రైస్ మిల్లర్లు రైతుల దాన్యానికి ధర చెల్లించడంలో రోజు రోజుకు ధర తగ్గిస్తుతున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ 15 రోజుల క్రితం వరి కోతలు ప్రారంభం అయ్యాయని, నాలుగు రోజుల క్రితం క్వింటాలుకు సన్న రకం ధాన్యం జెఎస్ఆర్, కావేరి, చింట్లు మూడు వేలు, 2750 రూపాయలకు కొన్న మిల్లర్లు ప్రస్తుతం ఒకే సారి 400 రూపాయలు తగ్గించారని, రూ. 2400, 2450లకు కొంటున్నారని ఆరోపించారు. దాన్యం ట్రాక్టర్లు రోజు రోజుకు పెరుగుతుండటంతో ధర తగ్గిస్తున్నారని ఆరోపించారు. పైగా రేటు ఇష్టముంటే అమ్మండి లేకుంటే వెళ్ళండంటూన్నారని ఆరోపించారు. ఈ రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి. వెంకటేశ్వర్లు, పి. గోవింద్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, పిల్లుట్ల సైదులు, పంగ అశోక్, జె. సైదులు, రవీందర్, దైద సైదులు, పి. వెంకన్నపాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా , నూతన కమిటీ ప్రమాణస్వీకారం...






**ఆలేరు ఏప్రిల్ 1 ప్రభాత సూర్య..:** ఆలేరు యాదాద్రి భువనగిరి జిల్లా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో బార్ అసోసియేషన్ కు ఎన్నికైన నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అధ్యక్షునిగా కొంతం ప్రసాద్, ఉపాధ్యక్షునిగా రావుల రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తోటకూర రాజు, సహాయ కార్యదర్శిగా సుపరి సంపత్ కుమార్, కోశాధికారిగా ఫారునంది రవికుమార్, క్రీడలకు కార్యదర్శిగా సామల రమేష్, సంస్కృతిక కార్యదర్శిగా సీసా శ్రీ హర్ష, కార్యవర్గ సభ్యులుగా మొరిగాడి కృష్ణ, పూల గురుమూర్తి, లోకేశ్వరి, సంగీత, పల్వార్, ఆసిఫా, మొబైన్ ప్రమాణస్వీకారం చేశారు. నూతన బాధితులకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదుల కోసం అడ్వకేట్ ప్రొడక్షన్ బిల్లు తెచ్చి అమలు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి బార్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే కోర్టు భవన నిర్మాణానికి శాయశక్తుల పాటుపడతానని చెప్పారు. ఎన్నికల అధికారి వనం రాజు నూతన బాద్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూకంటి రవీందర్, న్యాయవాదులు గొట్టిపాముల బాబురావు, సీసా శ్రీనివాస్ గౌడ్, ఏజిపి హరిబాబు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఉన్న తోపుడు బండ్లు నేతల విగ్రహాలు 15లోపు తొలగించాలి



**మిర్యాలగూడ ఏప్రిల్ 1:- (ప్రభాత సూర్య):** కోదాడ –జడ్చర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన రోడ్డు ఫుట్ పాత్ లపై ఉన్న చిరువ్యాపారులు ఈ నెల 15 లోపు వెనకకు జరిగి వ్యాపారం చేసుకోవాలని, అదేవిదంగా నేతల విగ్రహాలు ప్రతిష్ఠించిన వారు తొలగించాలని లేకుంటే అధికార యంత్రాంగం తొలగిస్తుందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టరేట్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హనుమాన్ పేట నుండి ఈదులగూడ వరకు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం నుండి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు 80 ఫిట్ల ఫోర్ వే నిర్మాణంలో, పట్టణ సుందరికరణలో భాగంగా రోడ్డు వెడల్పు చేస్తున్న క్రమంలో ప్రస్తుతం ఫుట్ పాత్ ల పై చిరు దుకాణాలు, తోపుడు బండ్లు పెట్టకుండా వెనక్కు జరగాలని కోరారు. జరగని పక్షంలో తామే పోలీసు, రెవిన్యూ, మునిసిపల్ శాఖ అధికారుల సమక్షంలో తొలగిస్తామన్నారు. జాతీయ, రాష్ట్ర, స్థానిక నాయకుల విగ్రహాలు సుమారు 17 ఉన్నాయని వాటిని ప్రతీష్ఠించిన వారే తొలగించాలని లేకుంటే అధికార యంత్రాంగం తొలగించి యాదగార్పల్లి చెరువు ట్యాంక్ బండ్, చిన్న చెరువు ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన వారి సమ్మతితో ప్రాతిష్టాస్తామని మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్ తెలిపారు. మసాయిదా పట్టణ మాస్టర్ ప్లాన్ నెల రోజుల్లో ప్రజామోదం కోసం ప్రవేశ పెట్టనునట్టు అందులో భాగంగా చర్చి రోడ్డు, టాకా రోడ్డు, ఏరియా హాస్పిటల్ రోడ్డు విస్తరణ ఉంటుందన్నారు. ప్రతిష్ఠించిన వారితో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు విస్తరణలో ప్రభుత్వ ఆదేశాలు, చట్ట ప్రకారం బందోబస్తు ఉంటుందని డిఎస్పీ కె.రాజశేఖర్ రాజు అన్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తైనా అనంతరం ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వెంకన్న, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె.అంజయ్యలున్నారు.

# చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అవకతవకలు

**ఎన్నికల అధికారులు అమ్ముడుపోయారని ఫిర్యాదు...**

**బార్ అసోసియేషన్ ఎన్నికను రద్దు చేయాలి...**

**న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి**



**చౌటుప్పల్, ఏప్రిల్ 01, ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ కు ఈనెల 26న జరిగిన ఎన్నికల్లో భారీగా అవకతవకలు జరిగాయని న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి ఆరోపించారు. ఎన్నికల అధికారులు కానుగుల వెంకటయ్య, సిహెచ్ రాధా కిషన్ రావు లు అమ్ముడుపోయారని ఆరోపిస్తూ న్యాయవాదులు వాకిటి నరసింహారెడ్డి, పాల పరమేష్, ఏ రంగారెడ్డిలు బుధవారం తెలంగాణ బార్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కానుగుల వెంకటయ్య, సిహెచ్ రాధా కిషన్ రావులు రెండు బ్యాలెట్ బుక్కులను ప్రింట్ చేయించి, సంతకాలు సైతం పెట్టి, ఒక బ్యాలెట్ బుక్కును ఒక వర్గం వారికి ఇచ్చి సహకరించారని ఆరోపించారు. ఒక న్యాయవాది వద్ద డమ్మీ బ్యాలెట్ పేపర్ దొరకడం, అందులో స్వస్తిక్ గుర్తు ఉండడంతో తమకు అనుమానం వచ్చిందని న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి స్పష్టం చేశారు. తాము వెంటనే ఎన్నికల అధికారులను సంప్రదించి, ఒక అధికారి సంతకం మాత్రమే ఉంది, రెండో అధికారి సంతకం పెట్టాలని, బయట నుంచి వచ్చే బ్యాలెట్ పేపర్లను ఆపవచ్చని చెప్పినా, వారు తమ మాటను లెక్క చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఓటరు తన నడుము వద్ద సెల్ ఫోన్ పెట్టుకోవడం, అది వీడియో కాల్ ఆన్ లో ఉండడం గమనించి, ఆ ఫోన్లో ఎన్నికల అధికారికి ఇవ్వగా, సీజ్ చేయకుండానే తిరిగి అతనికి ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు సమయంలో స్వస్తిక్ గుర్తులు వేరువేరుగా ఉండటం, ఇంకు డిఫరెంట్ గా ఉండటం, బ్యాలెట్ పేపర్లు ఎక్కువగా ముడతలు పడటం గమనించి తాము అభ్యంతరం వ్యక్తం చేసి, రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. బ్యాలెట్ పేపర్లు, స్వస్తిక్ గుర్తులు, ఇంకు ప్యాడ్ లను సీజ్ చేయాలని కోరమన్నారు. ఎన్నికల అధికారులు తమ ఫిర్యాదును తీసుకోలేదని, మెటీరియల్ ను సైతం సీజ్ చేయకుండా వదిలేశారన్నారు. దీంతో ఎన్నికల అధికారులు అమ్ముడుపోయినట్టు ధృవపడినట్లు స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులు తమ బండారం బయటపడుతుందనే మెటీరియల్ ను సీజ్ చేయలేదని వారు పేర్కొన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేస్తూ చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికను రద్దుచేసి, మరల ఎన్నికలు జరపాలని, ఎన్నికల అధికారులైన కానుగుల వెంకటయ్య, సిహెచ్ రాధా కిషన్ రావులపై విచారణ జరిపి, వారిని బార్ కౌన్సిల్ నుంచి తొలగించాలని వాకిటి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రైవేట్ బస్సుల ప్రయాణికుల భద్రతకు ముప్పు

**నిబంధనలు పాటించని ప్రైవేట్ బస్సులపై చర్యలు ఎక్కడ?**

**అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదంలో ప్రయాణికుల ప్రాణాలు**

**సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి**

**భద్రాచలం:** జెన్సీ ప్రాంతమైన చర్ల, భద్రాచలం నుంచి నడిచే ప్రైవేట్ వాహనాలు, ముఖ్యంగా ప్రయాణికులను తరలించే ప్రైవేట్ బస్సుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. అయితే, ఈ బస్సుల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి పట్టణాలకు ప్రతిరోజూ వందలాది మంది ఈ ప్రైవేట్ బస్సులపై ఆధారపడుతున్నారు. కానీ స్టాప్‌లు, పార్కింగ్ సౌకర్యాలు, సైనేజ్ బోర్డులు, సీసీటీవీ కెమెరాలు, టాయిలెట్లు, వెయిటింగ్ రూములు వంటి ప్రాథమిక వసతులు పూర్తిగా లేకపోవడం గమనార్హం. బస్సుల్లో పరిశు భ్రత కూడా సరిగా ఉండకపొగ ప్రయాణికులకు అందించే దుప్పట్లు ఎప్పటికప్పుడు ఉతికినవి ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా, ప్రమాదాల సమయంలో ఉపయోగపడే ఎమర్జెన్సీ ద్వారాలు సక్రమంగా పని చేయడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో అద్దాలు పగలగొట్టడానికి అవసరమైన హమర్లు కూడా అందుబాటులో లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు మార్గమధ్యంలో ప్రమాదానికి గురైన సంఘటన అందరికీ తెలిసిందే. ఆ సమయంలో ప్రయాణికులు ఎమర్జెన్సీ ద్వారాల ద్వారా బయటకు రావాలని ప్రయత్నించినా అవి తెరుచుకోలేదని వార్తలు విన్నాము. అద్దాలు పగలగొట్టేందుకు హమర్లు లేకపోవడం పరిస్థితిని మరింత విషమైంది. వెనుక భాగంలో ఉన్న అత్యవసర ద్వారం తెరిచినా అది బయటకు వెళ్లే మార్గంగా కాకుండా గదిలా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భద్రాచలం బస్ స్టాండ్ సమీపంలో ప్రైవేట్ బస్సులు రోడ్డుపక్కనే ఆగడం వల్ల ట్రాఫిక్ జామ్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. తెలంగాణ మోటార్ వాహన చట్టం 1988 (సెక్షన్ 93–99) ప్రకారం ప్రైవేట్ బస్సులకు నిర్దిష్ట ప్రమాణాలు, స్టాండ్లు ఉండాల్సి ఉన్నప్పటికీ అవి అమలులో లేవు. ఫలితంగా ప్రయాణికులు వర్షంలో తడుస్తూ, వేసవిలో ఎండలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ కారణంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ప్రయాణికుల ప్రాణ భద్రత దృష్ట్యా ప్రతి ప్రైవేట్ బస్సును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, నిబంధనలు అమలు చేయాలని, భద్రాచలం ఆర్టీవో, సంబంధిత అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

# 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

**29 కార్మిక చట్టాలను అమలు చేయాలి**

**కళ్ళకు గంతలు కట్టి నిరసన - ఎఐటియుసి**

పాడేరు: :అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఏప్రిల్ 1 న బ్లాక్ డే పాటించాలని నల్లని రిబ్బన్లు కళ్ళకు కట్టుకొని పాడేరు ఐటిడిఎ వద్ద నిరసన చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి అమర్,జల్లి రాజుబాబు లు పాల్గొని మాట్లాడుతూ నేటి నుండి 4 లేబర్ కోడ్ లను అమలు లోకి తేవటాన్ని నిరసిస్తూ ఈ రోజు బ్లాక్ డే గా పాటించాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునివ్వడం జరిగిందని. 4 లేబర్ కోడ్ లు అయిన వేతన కోడ్ 2019,పారిశ్రామిక సంబంధాల కోడ్2020,సామాజిక భద్రత కోడ్ 2020,వృత్తి భద్రత,ఆరోగ్య పరిస్థితి కోడ్ 2020 లను తీసుకురావటం లో పెద్దఎత్తున కార్మికులకు నష్టం వాటిల్లుతుందని, కార్మిక హక్కులు కాలరయబడతాయని 8 గంటల పనిధినం పోయి 12 గంటలకు పెంచబోతున్నారని అలానే సమ్మె హక్కు కోల్పోతుందని మరియు యూనియన్ ఏర్పాటుకు నిబంధనలు పెద్దఎత్తున పెంచటం వంటి అనేక విధానాలును ఉద్దేశించి కేంద్ర కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12 న దేశవ్యాప్త సమ్మె నిర్వహించినప్పటికీ నేటికి కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో భేటీ కాకుండా నిరంకుశంగా వ్యవహరిస్తుందని అన్నారు.గతం లో ఉన్న 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న ఎటువంటి స్పందన కేంద్రం నుండి లేదని మండిపడ్డారు. నరేంద్ర మోడీ, అమిత్ షా లు కేవలం కార్పొరేట్ వ్యక్తులకు దేశ లో ఉన్న శ్రమశక్తిని దారపోయటానికి చూస్తుంది తప్ప దేశ సంపద సృష్టి కర్తల అయిన కార్మికులు పట్ల ఆలోచన చేయటం లేదని అన్నారు.





## ధరిత్రి దినోత్సవ సదస్సు

# కరపత్ర ఆవిష్కరణ

**దరిత్రిని కాపాడుకోవడం మనందరి బాధ్యత**

**అటవీ శాఖ డివిజనల్ నల్లగొండ అధికారి వై శ్రీనివాస్**

**మునుగోడు, ఏప్రిల్ 01 :(ప్రభాత సూర్య):** మునుగోడు మండల కేంద్రం లో ధరిత్రి దినోత్సవ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు అటవీ శాఖ డివిజనల్ నల్గొండ అధికారి వై శ్రీనివాస్ అనంతరం వారు మాట్లాడుతూ,దరిత్రిని కాపాడుకోవడం ప్రజల అందరి బాధ్యత అని అన్నారు. ఈ నెల 22న ధరిత్రి దినోత్సవం పురస్కరించుకొని నల్లగొండ జిల్లా కేంద్రంలో ఇండియన్ ఎన్విరాన్ మెంట్ సోషల్ ఫోరం నిర్వహించే సదస్సు కరపత్రాన్ని మునుగోడు అటవీ ఆఫీస్ యందు మా చేతిలో మీదుగా ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. భూమిని కాపాడుకోవాలంటే ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా కాలుష్య కారకాలను వాడకుండా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా, ఇండియన్ ఎన్వి రాన్ మెంట్ సోషల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జీడిమెట్ల రవీందర్ మాట్లాడుతూ, ధరిత్రి దినోత్సవం ప్రతి ఒక్కరు విధిగా జరుపుకొని విరివిరిగా మొక్కలు నాటి భూమిని కాపాడాల్సిన బాధ్యత మానవాళి పై ఉందని ఆయన అన్నారు. నల్లగొండలో జరిగే ధరిత్రి సదస్సును ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో, ఇండియన్ ఎన్విరాన్ మెంట్ సోషల్ ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట నరసింహా చారి, ఎండి అఫీస్ ఖాన్ ఫారెస్ట్ రేంజ్ అధికారి మునుగోడు, ఎస్ సుచరిత డిప్యూటీ రేంజ్ అధికారి , ఎం రాములు డిప్యూటీ రేంజ్ అధికారి, బి అఖిలేష్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి, ఇండియన్ ఎన్విరాన్ మెంట్ సోషల్ ఫోరం నల్లగొండ జిల్లా అధ్యక్షులు జిట్టగోని వెంకటేశం, సామాజిక ఉద్యమ నాయకులు గుర్రాల పరమేష్, పందుల బిక్షం, జర్నలిస్టు నాయకులు ఐతరాజు సత్యం, ఉదయ్, లావణ్య, చందన, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సమత వేదిక, జహీరాబాద్ నూతన కమిటీ ఎన్నిక

**జహీరాబాద్/టౌన్: ఏప్రిల్ 01:** ఏప్రిల్ నెల మాసంలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం రోజు జహీరాబాద్ లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సమతా వేదిక కమిటీని ఎన్నుకోవడం జరిగింది. రిజర్వేషన్ల పితామహుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రాం అంటే భారత దేశ చరిత్ర లో ఒక సుదీర్ఘ అధ్యాయం. భారతదేశంలో అత్యధిక కాలం కేంద్రమంత్రిగా పనిచేసిన అపజయంలేని రాజకీయ నాయకుడు డా బాబు జగ్జీవన్ రామ్,దేశానికి చేసిన సేవలను,దళిత జాతికి చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ, ఆయన ఆశలను కొనసాగింపుగా ఈ కమిటీ జహీరాబాద్ నియోజకవర్గ ప్రాంతంలో ఆ మహనీయుని ఆశయ సాధనాలకు ఈ కమిటీ కృషి చేస్తుందని ఎన్నిక కాబడిన అధ్యక్షులు జె జయరాజ్ పేర్కొన్నారు. ఈ కమిటీలోని సభ్యులుగా జె జైరాజ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు బి.భాస్కర్ మాజీ జడ్పీటీసీ, ఏ.రామచందర్, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు, కార్యదర్శులు సురేష్ మాజీ సర్పంచ్,మూర్జల్, కోశాధికారి అశోక్ కుమార్ లీగల్ అడ్వైజర్స్ సొలొమోన్, సందీప్ కుమార్, నతానియల్, చిరంజీవి, ప్రిన్స్, డింపుల్ కార్తీక్ ఈట్టి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు వై స్వామి దాస్ మాజీ సర్పంచ్, ఏం స్వామి దాస్ మాజీ సర్పంచ్, శివకుమార్, చిన్న, సొలోమోన్, జాన్సన్, ధనరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రబీ (యాసంగి) ప్యాడీ కొనుగోళ్లకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట:** జిల్లాలో రబీ (యాసంగి) 2025–26 సీజన్‌లో ప్యాడీ కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో వరిధాన్యం సేకరణ, మద్దతు ధర అమలు అంశాలపై డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా తదితర శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ఈసారి జిల్లాలో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన మంచినీటి సదుపాయం, టెంట్లు, బ్యానర్లు, ప్యాడీ క్లీనర్లు, రిజిస్టర్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేయడంతో పాటు, కేంద్రం బార్డర్ వరకు స్పష్టంగా కనిపించేలా లైటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి నష్టపోకుండా ఎత్తైన ప్రదేశాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూడాలని, రైతులు పండించిన పంటను కల్లాల్లో బాగా ఆరబెట్టిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేల రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా, రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు తెలియజేయాలని సూచించారు. ధాన్యాన్ని బాగా తూర్పారబెట్టిన తరువాత మాత్రమే కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేలా చూడాలని, రైతులతో పూర్తి బాధ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కన్సెంట్ తీసుకోవాలని తెలిపారు. ఈ నెలలో ధాన్యం దిగుబడి అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ మీటర్లు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతిరోజూ ఉదయం ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మధ్యాహ్నం కల్లా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

## మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన



బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.



# చెల్లి నిర్మాత...అన్న హీరోగా బరిలోకి
# వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం

## హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో

దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. కాంతార సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సక్సెస్ సమయంలో టీమ్ సభ్యులను సోషల్ మీడియా నుంచి దూరం పెట్టడం వెనుక అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉంది.

# ఆ స్టార్ డైరెక్టర్‌తో మరోసారి ..
# హిట్ మూవీకి సీక్వెల్ రానుందా



మంగాత్తా చిత్ర కాంబో రిపీట్ కానుందా? అంటే కోలీవుడ్‌లో అవుననే టాక్ వినిపిస్తోంది. స్టార్ హీరో అజిత్, దర్శకుడు వెంకట్ ప్రభులది హిట్ కాంబినేషన్ అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీరి కాంబోలో 2010లో తెరకెక్కిన మంగాత్తా చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. ఆ చిత్రంలో నటుడు అజిత్‌ను విలనిజంతో కూడిన స్టైలిష్ పాత్రలో చూపించి సక్సెస్ అయ్యారు డైరెక్టర్.దీంతో వీరి కాంబినేషన్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సమయం ఇప్పుడు రానుంది. దర్శకుడు వెంకట్ ప్రభు.. శివకార్తికేయన్ హీరోగా చిత్రం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని నటుడు శివకార్తికేయన్ కూడా తెలిపారు. అయితే ఈ చిత్రం ప్రారంభంలో ఆలస్యం జరగనున్నట్లు తెలిసింది. దీంతో దర్శకుడు వెంకట్ ప్రభు ఇటీవల నటుడు అజిత్‌ను కలిసి కథ వినిపించినట్లు సమాచారం.అది ఆయనకు నచ్చడంలో అందులో నటించడానికి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. కాగా అజిత్ 2027 జనవరి వరకు చిత్రాల్లో నటించనని ఇంతకు ముందే ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఆయన 64వ చిత్రాన్ని గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం ఫేమ్ ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో నటించనున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో వెంకట్ ప్రభు దర్శకత్వంలో అజిత్ నటించే చిత్రం ఎప్పుడు ప్రారంభం అవుతుంది? దానికి సంబంధించిన వివరాలు ఏమిటి? అన్నది తెలియాలంటే మరికొద్ది కాలం ఆగాల్సిందే. ఇకపోతే ఇది మాంగాత్తాకు సీక్వెల్‌గా ఉంటుందా? లేక కొత్త కథా చిత్రంగా ఉంటుందా? అనే ఆసక్తి నెలకొంది.

# జోడీ కుదిరింది

సల్మాన్ ఖాన్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా రానుందని, ఈ చిత్రాన్ని 'దిల్' రాజు, శిరీష్ నిర్మించనున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సల్మాన్ ఖాన్ సరసన నయనతార నటించడం దాదాపు ఖరారైయిందని, కథ నచ్చి ఆమె ఒప్పుకున్నారని సమాచారం.ఈ జోడీ గురించి త్వరలోనే అధికారిక ప్రకటన రానుందట. ఇక ఈ సినిమా చిత్రీకరణను ఏప్రిల్ చివర్లో ప్రారంభించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని భోగట్టా. మరోవైపు ప్రస్తుతం సల్మాన్ 'మాతృభూమి' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.